కథ

# మొహబ్బత్ 1424 హిజ్రి

సైబాబ

అయాల సైబర్ కేఫ్‌ల హుషార్‌గ 'అవీయివీ' చూసినంక చాట్ ఓపన్ చేసిన. అయాల్టికి ముందు రొండుసార్లుమాట్లాడిన వాసును పల్కరిద్దామని పేర్లను ఉరికిస్తున్న. ఝుట్‌న ఒకతానరుకాయించి ఎన్కకు కొన్ని పేర్లు పోనిచ్చిన- 'సుల్తానా!' పరేశానయిన. చాట్‌ల ఒక ముస్లిం ఆడ పేరా?! వాహ్! ఎండాకాలం ఆకాశంల ఒక మబ్బుతున్క!

క్లిక్ చేసిన. Assalamalaikum! mera naam Shafi. Kya aap mujhse dostaana karoe? అని కొట్టిన.

నో రెస్పాన్స్. ఏంచెయ్యాలె? మనసు కొద్దిగ ముడుచుకుపోయింది. వేరే కొన్ని పేర్లు క్లిక్ చేస్కుంట కొద్దిసేపు గడిపిన. ఆడపిల్లల పేర్లను కొని మాట్లాడదామంటే నా పేరు చూసి ఎవరూ రెస్పాన్స్ ఇస్తలేరనిపించింది. ఎక్కువ శాతం ఆడపిల్లల పేర్లు ఆఖరికి మగపోరగాల్లేనని అర్థమయ్యి అనవసరంగ టైం వేస్టనిపించింది. మజ్జెమజ్జెల సుల్తానా గురించి చూస్తనే ఉన్న. అంతల్నె Sulthana left the room అని పడింది. అరెరె! నేను క్లిక్ చేసే టైంకి సుల్తానా ఎల్లిపొయ్యే మూడ్‌ల ఉన్నట్లుందని సమజై మనసు ఖరాబైంది. ఆ ఇరవై రూపాల గంటదాకా మళ్లా అవీఇవీ చూసేసి బైటికొచ్చిన.

రొండోరోజు మల్ల ఆ టైంకు కొద్దిగ ముందే కేవలం సుల్తానా కోసమే కేఫ్‌కు పోయ్న. పోంగనె ముందుగాల చాట్ ఓపన్‌చేసేసి తిరిగి అదే రూంలకెల్లి 'ఎస్'ల చూసిన. యాహూ... సుల్తానా ఈజ్‌దేర్! క్లిక్ చేసిన. తిరిగి నిన్నటి వాక్యమే కొట్టిన. కొద్దిసేపు టెన్షన్. ఆబాక్సుల సుల్తానా ఆన్సర్ ఇస్తున్నట్లు పడేసరికి యమ ఖుషీ అనిపించింది. జవాబ్ పడింది. 'అస్సలామలైకుమ్! మేరా నామ్ సుల్తానా అంజుమ్. ఆప్‌కి దోస్తి బన్నేమే ముఝే కుచ్ ఎయితెరాజ్ నహీఁ హై. ఆప్‌కే బారేమే ఔర్‌కుచ్ బతాయియే...'

ఓహ్! ఎక్కడ్లేని సంబరమైంది. ఇగ అయాల అన్నం మీద నీల్లమీద ద్యాసుంటె ఒట్టు.

అయాలట్నించి షురూ... ఎంతగనమో కష్టపడి ఎక్వసార్లు 4 టు 5 టైంకు కేఫ్‌కు పోబట్టిన. పొయ్‌నకాడ్నించి సుల్తానాతోటి మాట్లాడ్తమె సరిపొయ్యేది. పోలేకపొయ్‌న తెల్లారి ఎందుకు రాలేదని అడిగేది సుల్తానా. పైసల్లేక అని చెప్ప బుద్ధికాక ఏదో పనిబడ్డట్టు చెప్పేది. తర్వాతి నెలనుంచి ఫాయ్‌దా లేదని కష్టపడి మంత్లీ మాట్లాడుకున్న. ఇగ రోజు పోబట్టిన.

చిన్నచిన్నగ మా మాటల్ల దగ్గరితనం పెరిగింది. ఒక్కరోజుగుడ మాట్లాడుకోకుంట ఉండలేక పోతున్నం ఇద్దరం. అదే విషయం ఒకరికొకరం చెప్పుకున్నం. ఎవరన్న రాకపోతె రొండోరోజు అలగడాలు... సమ్‌జాయింపులు... వగైరా... వగైరా...

ఒకరోజు ఇగ ఉండబట్లేక 'నిన్ను చూడాలనిపిస్తుంది సుల్తానా. మనం ఎక్కడన్న కలుద్దామా' అన్న. ఇప్పుడు కలవడం కుదరదన్నది. ఎందుకంటె చెప్పదు...! కనీసం మీ ఊరేదో, మీ అబ్బా పేరేందోనన్న చెప్పరాదు, నా కష్టాలేవో నేను పడ్తనన్న. ఉహుఁ. సస్తె చెప్పనన్నది.

సుల్తానా షానా హుషారు. ఒక్కోపాలి యమ ఇరకటంల పెట్టేది. అడగకనె అన్నీ తెల్సుకునీది. చెప్పకనె అన్నీ చెప్పేది. అబ్బో! ఒక్కోపాలి చంపేసేది. ఒకపాలి మాటల్ల పెట్టి టకటక కొశ్చన్‌ల అడుక్కుంట మా ఊరిపేరు నేను చెప్పేసేటట్లు చేసింది. అంతదాంక తను వాళ్ల ఊరేదో చెప్పలె. నువ్వు చెప్పినప్పుడె నేన్‌గుడ చెప్తననుకుంట వస్తున్న నేను.

'మీ చెల్లెండ్లను చదివిస్తున్నవా?' అనడిగిందొకసారి. ఒకామె చదువుతలె. ఇంకొకామె చదువుతుందని చెప్పిన. 'ఓహో నీకిద్దరు చెల్లెండ్లా, మరె ఒకామెను ఎందుకు చదివిస్తలేరు' అనుకుంట మళ్లా...

'...ఏఁ! నిన్నింట్ల ఎక్వ మాట్లాడనియ్యరా?' అనడిగిన నేనోపాలి.

'మా ఇంట్ల నేనే ఎక్వ మాట్లాడ్త. మా చెల్లె అస్సలు మాట్లాడదు' అన్నది.

'అహాఁ! ఐతె నాకొక మర్దల్ గుడ ఉన్నదన్న మాట' అన్న.

'ఏయ్! హద్దులు మీరుతున్న'వన్నది.

'మాఫ్‌కర్నా! మీ చెల్లెల్ని యాద్ చేసిన్నని చెప్పు. షానా చిన్నదైతే ముద్దులు చెప్పు' అన్న. మల్లా గొడవ. ఆ చెల్లెలి పేరడిగితె గుడ చెప్పలె.

మా దాది చచ్చిపోతె నేనొక మూణ్రోజులు పోలె. నాలుగోరోజుపోయి చూస్తె, మూణ్రోజులు ఎందుకు రాలె? అనే క్వశ్చన్ కొట్టి అలిగి కూసున్నది. మా దాదీ చచ్చిపోయింది, అస్సలు ఇటు దిక్కు వస్తాన్కి కుదర్లె అని ఎన్నితీర్లుగ చెప్పినా వినదే!

'ఒక్కపాలి ఒచ్చి చెప్పిపోతె ఏం పొయ్యింది. మూడురోజులు ఎంత పరేశానయ్యిన్నో తెల్సా. రాత్రిళ్లు నిద్రగుడ పట్టలె. ఇంత ఎదురుచూస్తనని తెల్సిగుడ నువ్వు ఇట్ల చేస్తవ... ఏంది, అట్ల బేచైన్ చేచైన్గుంటున్నవ్ అని మా అమ్మి ఒకటే మొత్తుకున్నది. మా అబ్బా కాలేజ్ మానెయ్యమన్నడు తెల్సా! కాలేజ్ మానేస్తె ఇంకేమన్న ఉందా, మళ్లా నీతోటి మాట్లాడలేను...'

'ఓహో! నువ్వు కాలేజ్ చేస్తున్నవా?' అన్న మద్యల నేను.

'చాల్లే. ఇంతదాంక సమజే కానట్లు. కాలేజ్ చెయ్యకపోతె రోజు ఈ కేఫ్‌కు ఎట్ల వస్త. అసలు నువ్వు మొద్దు. బుద్దు...' ఒకటె తిట్లు...

నేనేదొ మాట్లాడించబొయ్‌న.

'నువ్వేదో నన్ను మాటల్ల పెడితె అలక మర్శిపోతననుకుంటున్నవేమొ, ఈరోజింక నీతొ ఏం మాట్లాడను. నువ్వే మాట్లాడాలె' అని సప్పుడు జెయ్యకుంట కూసున్నది.

ఇగ ఆ ముప్పావుగంటసేపు నేను మాట్లాడిన. సుల్తానా అస్సలు మాట్లాడలె. ఆఖరికి లేషిపొయ్యేటప్పుడు 'ఖుదా హాఫీజ్' కొట్టింది. నాకు తిక్క లేషింది. రొండోరోజు నేను 'అస్సలామ లైకుమ్' కొట్టి ఒక పావుగంట ఏడ్పించిన.

ఇట్ల మొత్తాన్కి మూణ్నెళ్లు గడిచిపొయ్‌నయ్. మద్యమద్యల నా గురించి షానా విషయాలె చెప్పినగని సుల్తానా గురించే ఎక్కువేం రాబట్లేకపొయ్‌న. మొదట్ల వాళ్ల ఫ్రెండ్ భవాని బలవంతంమీద ఇష్టంలేకుంటనె కేఫ్‌కొచ్చిన సుల్తానాను చూసి ఇప్పుడు భవానే పరేశానయితుందని చెప్పింది. ఇంక షానాషానా ముచ్చెట్లు చెప్పేది.

ఒకరోజు అనుకోకుంట కొన్ని సవాల్లు అడుగుత చెప్పు అన్నది. అడుగు అన్న.

'1. లేన్‌దేన్ తీసుకుంటవా?'

'ఊఁ... మీ అబ్బా ఇవ్వగలిగితె తీసెకుంటెనె



బెటర్'

'అగో, హద్దులు దాటుతున్నవ్. నన్ను చేస్కుంటవా అని నేన్నిన్ను అడగలె. గుర్తుంచుకో. 2. మీ బీవీని నౌకరీ చెయ్యనిస్తవా?'

'ఇప్పుడే ఎట్ల చెప్పను?'

'అంటే?!'

'ఊc... ఆమె యిష్టం'

'3. సాంప్రదాయాలన్ని పాటింపజేస్తవా?'

'...మా ఇంట్ల ఊరుకోరు కాబట్టి తప్పవు'

'ఛల్! నువ్వు దొంవు. అన్ని దొంగ జవాబ్లిస్తున్నవ్. నీకంటూ ప్రత్యేకమైన అభిప్రాయాలులెవ్వా?'

'ఉన్నయ్'

'ఉంటే చెప్పు'

'ఊc...'

'వో దేఖో! మల్లా గంట సోంచాయించకు. నీకు ప్రత్యేకమైన అభిప్రాయాలు ఉండవ్. ఎందుకంటె నువ్వు పురుషుడివి. తేరగ వొచ్చే సుఖాలన్ని అనుభవించే పురుషుడివి. నాకు నీలాంటి వాళ్లమీద చాలా కోపం... బై. కల్ మిలేంగే!

** ** **

తర్వాత ఇంకొన్ని దినాలకు ఉండలేక మల్లా అడిగిన, 'సుల్తానా! నిన్ను చూడాల్నని షానా అన్పిస్తున్నది, మీ ఊరేదో చెప్పు. ఎంత కష్ట పడైనా నిన్ను కలుసుకుంట.'

'వద్దు'

'ఎందుకు'

'చెప్పను... ఇప్పుడే వద్దు

'భయపడుతున్నవా?'

'వేరే ఏమైనా మాట్లాడు షఫీ. టైం అయిపోతది.'

'నాకు నిన్ను చూడాలని బాగా అన్పిస్తున్నది. అదే మాట్లాడాలనిపిస్తున్నది. అంతే.'

'ఇప్పుడే కలవడం వద్దన్న కదా! నేను ఎల్లిపోత మరె!'

'అచ్ఛా అచ్ఛా, కనీసం నీఫోటో పెట్టొచ్చు కదా'

'ఆcహాc.. ఈజీగా చూసేద్దామనా!'

'ప్లీజ్ సుల్తానా, ప్లీజ్'

'ముందు నీ ఫోటో పెట్టు'

'అబ్బా, నాకాడ రెడీగ ఫోటోలు లెవ్వు. ముందు నువ్వు పెట్టు. తర్వాత నేను పెట్టేస్త.'

'అదేం కుదరదు. ముందు నువ్వు పెట్టు. తర్వాతె నేను'

'నేను దిగాలె. మంచి ఫోటోలు లెవ్వు. టైం పడ్తుంది గద'

'నేనుగుడ దిగాలె'

'ప్లీజ్ సుల్తానా!'

'పర్వాలేదు షఫీ. నువ్వు దిగి పెట్టినంకనె నేను పెడత.'

'హుత్! నీతోటి లాభంలేదు. మొండి.. మనం కల్సుకున్నంక చేస్త నీ పని...'

** **

నా ఫోటో పెట్టినంక మల్లొకవారం రోజులు సతాయించింది సుల్తానా. నేను మొత్తుకోంగ మొత్తుకోంగ ఆఖరికి జుమ్మా రోజు ఫోటో పెడతనన్నది. ఆ జుమ్మా ఇంకా మూడ్రోజులుంది. ఆ మూడ్రోజులు ఎంతగనం లేటుగ గడిచినయో...

ఇగ రేపనంగ ఆ రాతిరి నాకు నిద్రపడితె ఒట్టు. తీరుతీర్లుగ ఊహల్లకు రాబట్టింది సుల్తానా మొఖం. ఆఖరికి రాతిరి కలలగూడ అదే సీన్.

ఇగ తెల్లారి లేషిన కాణ్నించి కేఫ్‌కు పొయ్యిందాన్క అయాల టైం జల్ది గడిస్తెగ! బేజారైపొయ్న. ఒక అద్దగంట ముందుగాల్నె కేఫ్‌కాడికి పొయ్యి నా టైం ఐందాంక వెయిట్‌చేసి ఆఖరికి ఇంటర్నెట్ ఓపెన్ చేసినంకగాని కొద్దిగ నిమ్మలపడలె. కనీ దిల్ మాత్రం షానా టెన్షన్‌గ కొట్టుకోబట్టింది. ఎన్నిసార్లు అనుకున్ననో సుల్తానా అందంగ ఉండాల్నె, కండ్లు బాగుండాలె, ముక్కు బాగుండాలె, స్ట్రక్చర్‌బాగుండాలె, వగైరా వగైరా.

కనీ సుల్తానా ఫోటో పెట్లేదు. అసలు రాలె! పావుగంటైంది. రాదా ఏందన్పించింది నాకు 'అస్సలామలైకుమ్ షఫీ!' అని కన్పించినంక హమ్మయ్య అనుకున్న.

'ఇంత లేటా?'

'ఇంట్ల ఇయాల నాకు పెండ్లిచూపులు అయ్నయ్. మా పక్కింటికొచ్చిన చుట్టాలు అనుకోకుంట నన్ను చూస్తానొచ్చిన్రు. దాంతోటి నన్నస్సలు బైటికిరానియ్యలె. నేనె నువ్వు ఎదురుచూస్తుంటవని ఏదో అబద్ధం చెప్పొచ్చిన.'

'పెండ్లిచూపుల్ల ఏమైంది?'

'ఏమైద్ది, నేనే ఏం తేల్చుకోలేకపోతున్న.'

'ఏం చెప్పినవ్'

'ఏం చెప్పలె... నిన్ను అడిగి చెప్తామని...'

'...ఏమడుగుదామనుకున్నవ్'

'... మనం... షాదీ చేసుకోగలమా?'

'... ఇంత సడెన్‌గ ఏం చెప్పను?!'

'టైం కావాల్నా!'

'నువ్వు మీ ఇంట్ల ఎప్పట్లోగ చెప్పాలె?'

రెండ్రోజుల్ల. ఎల్లుండి మల్లావాళ్లు వస్తరంట.'

'నేను రేపు చెప్త.'

'సరె... అసలు నన్ను చూడకుంట చెప్పగలవా? నేనంటె నిన్ను ఫోటోల్ల చూస్తి. చూడకున్నా నచ్చేదాన్ని. కాని నువ్వు నచ్చగలవా, నన్ను చూడకుంట?'

'... అదే కోశిష్ చేస్తున్న...!'

'... ఇంకా చెప్పు ఏమన్నా'

'ఫోటో తేలేదా? ఇయాల పెడతనన్నవ్'

'తెచ్చిన, నీకోసం దిగింది. ఇక్కడి ఇన్‌స్ట్రక్టర్ మంచి పిల్ల. ఆమె కిచ్చి పెట్టమని చెప్పి ఎల్లిపోత. జల్ది పోవాలె.'

'అచ్ఛ! ఇచ్చి ఎల్లు.'

'ఖుదా హాఫీజ్!'

.... ... ... !... !!

నా లోపట ఆత్రం పెరిగింది. ఒకటే టెన్షన్. ఎన్ని నెలలైపొయ్యింది ఈ రూపాన్ని రకరకాలుగ ఊహించుకుంట ఉండిపొయ్య... ఎంతగనం అడగంగఅడగంగ చూడబోతున్న ఫోటో...

చెమట్లుపడ్తున్నయ్. గుండెదడ పెరుగుతున్నది. ఫ్చ్... ఓహ్... అల్లా! అయ్ అల్లాహ్! నాకు నచ్చే అంత అందంగ ఉండాలె... మస్తు అందంగ, మంచి స్ట్రక్చర్‌తో ఉండాలె... ఒకాల బాగలేకుంటె?!? ఫోటో స్టార్ట్ అయింది...

నా కండ్లు రెప్పలు మూయడం మరిషిపొయ్నయ్. నోరు తెర్సుకుని అట్లనె చూస్తున్న. ఫోటో చక్... చక్... చక్... మన్నట్లుగ కొంత కొంత పైనించి కిందికి పడసాగింది. ఫస్టు నల్లని వెంట్రుకలు. తర్వాత తెల్లనినుదురు. వాహ్! నా పెదవులు కదిలినయ్. మొత్తానికి తెలుపే అన్న ఖుషీ ఉరుకులు పెట్టింది నా లోపట.

నుదురు ఇంకా పెరిగింది. తర్వాత కనుబొమ్మలు..ఎంత అందంగా ఉన్నయో..తర్వాత కండ్లు...

వ్వాటే బ్యూటీ! ఎంత అందంగ ఉన్నయో కండ్లు. ఎగిరి గంతెయ్యాల్ననిపించింది నాకు. నా మొఖమంత, మనసంత సంతోషం పట్టకుంటయ్యింది. అది కేఫ్ కాబట్టి సరిపొయ్యింది. లేకపోతె అరిచేవాణ్నే... అంతల–

అరె! ఏందిది? ఫోటో పడ్తలేదు. ఏమన్న కంప్యూటర్ ఫాల్టా?! ఇదేంది నల్లగ...! ముక్కు కాణ్నుంచే నల్లగ?!... చిన్నగ సమజ్ ఐంది నాకు, నఖాబ్ షురూ అయిందని. ఆఖరిదాన్క చూసిన. కండ్లు తప్ప ఆ మొఖంల ఏం కన్పిస్తలె! బుర్ఖా ఏస్కొని దిగిన హాఫ్ ఫోటో!! మనసు ఖరాబైపొయ్యింది!

